ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

## OFFICIAL REPORT

బుధవారము, ఫిబ్రవరి 15, 2006

12 వ శా. స. VI స. వాల్యూం -- I నంబరు --1

శక సంవత్సరము - 1927, మాఘం - 26

## WEDNESDAY, THE 15th FEBRUARY, 2006

**12 L.A. VI S. VOL-- I No. - 1**

26 **- Magh , 1927 - S.E.**

#


శాసనసభ సచివాలయము
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | శ్రీ కె. ఆర్. సురేష్‌రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | ః | శ్రీ యు . పురుషోత్తమ రెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా.(శ్రీమతి) కుతూహలమ్మ<br>శ్రీ నాదెండ్ల మనోహర్<br>శ్రీ డి. నరేంద్ర కుమార్<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | ః | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ ఎస్. వెంకటేష్<br>శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ యు. జగదీశ్వర్<br>శ్రీ ఎన్. అంజయ్య |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ ఎం.వి.వి.సత్యానందం<br>శ్రీ పి. సీతారాములు<br>శ్రీ కె.ఎ.నర్సింహరాజు<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ పి. సత్యనారాయణ<br>శ్రీ కె. తులసీరాం<br>శ్రీ డి. సత్యనారాయణ<br>శ్రీ ఎ. రామిరెడ్డి |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీమతి వి. గిరిజా సుందరి |

--------

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
## అధికార నివేదిక

**( పన్నెండవ శాసనసభ)**

**( ఆరవ సమావేశము : మొదటి రోజు )**

**బుధవారము, ఫిబ్రవరి 15, 2006**

**సభ ఉ. గం. 9.00 లకు ప్రారంభమైనది**

**( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )**

----------

## విషయ సూచిక

1. సంతాప తీర్మానము
శాసనసభ్యులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారి మృతిపట్ల

---------

## సంతాప తీర్మానము

### శాసనసభ్యులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారి మృతిపట్ల

Dr. Y.S. RAJASEKHARA REDDY: Sir, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Dronamraju Satyanarayana, the Member of Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of bereaved family."

MR.SPEAKER:Motion moved.

డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, ఇది ఎవరూ ఊహించని సంఘటన. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారు పోయిన అసెంబ్లీ సమావేశాల్లో బాగా చురుకుగా పాల్గొన్న వ్యక్తి. మనందరితో కలిసిపోయి, చాలా సరదాగా గడిపిన ద్రోణంరాజు సత్యనారాయణగారు తన 72వ ఏట మృతి చెందారు. విద్యార్థి దశ నుండి కూడా రాజకీయాల్లో పాల్గొంటూ, గ్రామ సర్పంచ్ స్థాయి మొదలుకొని అనేక రాజకీయ పదవులను అధిష్టించారు. ఒకసారి లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు, రెండుసార్లు శాసనసభకు, మరొకసారి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, అంతకంటే ముందు వుడా ఛైర్మన్‌గా అనేక పదవులు అలంకరించారు. ఆయన ఏ పదవిలో ఉంటే, ఆ పదవికే వన్నె వచ్చింది. ప్రతి విషయంలోనూ నల్గురిని బాగా కలుపుకునిపోయే వ్యక్తి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న వ్యక్తి. అటువంటి ద్రోణంరాజు సత్యనారాయణగారు మృతి చెందడం మనందరికీ చాలా బాధాకరమైన విషయము.

ద్రోణంరాజుగారు కేవలం రాజకీయాల్లోనే కాకుండా, ట్రేడ్ యూనియన్ మూవ్‌మెంట్‌లో కూడా పనిచేశారు. చాలా యూనియన్లకు ఆయన అధ్యక్షుడుగా, గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. అదే విధంగా విలేజ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు ఆయన చాలా కాలం నాయకత్వం వహించారు.

వీరు మంచి కళా పిపాసి కూడా. తాను స్వయంగా నటించినవాడు. అనేక నాటకాల్లో పాత్రలు వేశారు. ఆశువుగా చాలా పద్యాలు చెప్పేవారు. ఆయన ఎంత బాధపడుతున్నా, పది మందిని నవ్వించేవారు తన వాక్చాతుర్యంతో. అవన్నీ మన కళ్లకు కట్టినట్లుగా కనపడుతున్నాయి. ఆయన లేని లోటు ముఖ్యంగా నాకు వ్యక్తిగతంగా తీరని లోటు. 1978వ సంవత్సరం నుండి ఆయన నాకు తెలిసిన వ్యక్తి. గడిచిన రెండు దశాబ్దాలుగా నాకు ఆయనతో బాగా సన్నిహితం ఉండేది. ఆయన లేని లోటు నాకు వ్యక్తిగతంగానే కాకుండా, కాంగ్రెస్ పార్టీకే కాకుండా, ఉత్తరాంధ్ర జిల్లాలకు కూడా తీరని లోటు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి ప్రసాదించాలని, ఆయన కుటుంబానికి ఆయన లేని లోటును భరించేటట్లు ఆ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు (కుప్పం) : అధ్యక్షా, నిన్నటి వరకు మనందరితో ఉండి, పోయిన సమావేశాల్లో కూడా పార్టిసిపేట్ చేసిన గౌ.ద్రోణంరాజు సత్యనారాయణగారు చనిపోవడం చాలా బాధాకరం. ఆయన 19-12-1933వ తేదీన చిన్నముషిడివాడ గ్రామంలో జన్మించి, 28-12-2005వ తేదీన అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. ప్రజలతో నేరుగా సన్నిహిత సంబంధాలు కల్గిన వ్యక్తి. ఆయన ఆరోగ్యం బాగా లేనప్పుడు నేను వారిని చూశాను. ఆ విధంగా ముందుగా వారిని చూడటం జరిగింది. అయితే విధిని ఎవరూ తప్పించలేరు. ఆయన మరణానికి నా ప్రగాఢ సంతాపం తెలియచేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా.జి. విజయరామారావు (స్టేషన్ ఘనపూర్) : స్పీకర్ సార్, ఈ సభలో చాలా సీనియర్ సభ్యులు, మొన్నటి వరకు మనతో కలిసి ఉన్న గౌ.ద్రోణంరాజు సత్యనారాయణగారు మరణించడం రాష్ట్రానికి చాలా తీవ్రమైన లోటు. వారు గ్రామ స్థాయి నుండి మొదలుపెట్టి పార్లమెంట్ వరకు అనేక ప్రజాప్రాతినిధ్య పదవులను అధిష్టించారు. నిరంతరం ప్రజా సేవలో నిష్పక్షపాతంగా

పాల్గొంటూ, ప్రజాసమస్యల కొరకు నిరంతరం పోరాటం చేసిన మహా వ్యక్తి. వారు తన రాజకీయ ప్రయాణంలో ఒక సిద్ధాంతానికి కట్టుబడి, ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా, రాజకీయ విలువల్ని పాటించిన మహానాయకుడు. వారి మరణం రాష్ట్రానికి తీరని లోటు. వారి కుటుంబ సభ్యులందరికీ ఈ సందర్భంగా నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య (నకిరేకల్) : అధ్యక్షా, ద్రోణంరాజుగారు రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్‌పార్టీ రాజకీయాల్లో ఆయన ద్రోణాచార్య పాత్ర వహించిన విషయం అందరికీ తెలుసు. ప్రత్యేకంగా వారికి వయస్సు మీదపడుతున్నా, తన ఆరోగ్యాన్ని సహితం లెక్క చేయకుండా, కొన్ని సమస్యలు వచ్చినపుడు పట్టుదలతో పనిచేయడంలో ముందు ఉంటారు అన్న దానికి ఒక ఉదాహరణ ఏమిటంటే, సింహాచలం పరిసర ప్రాంతాల్లో ఉన్న వారి ఇళ్ల స్థలాలకు సంబంధించి, వారికి న్యాయం చేయాలని మేము ఆయన దృష్టికి తీసుకుని వెళ్లితే, ద్రోణంరాజుగారు --కొరటాల సత్యనారాయణగారిని, మమ్మల్ని అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఎమ్.ఎస్.ఆర్. దగ్గరకు తీసుకుని వెళ్లి, మాతోపాటు వారు కూడా వచ్చి, ఇప్పుడు అక్కడ నివాసం ఉంటున్న వారందరికీ న్యాయం చేయవలసిందేనని పట్టుబట్టారు. వారు మరణించిన తరువాత మన శాసనసభ హామీల కమిటీ వారి స్వస్థలానికి వెళ్లినపుడు, వారం రోజుల కిందటే వారు తమ జన్మదినాన్ని జరుపుకున్నట్లుగా మేము అక్కడి పరిసరాలను గమనించడం జరిగింది. అక్కడ ఉన్న వారు ఏమి చెప్పారంటే, ద్రోణంరాజుగారు ఎప్పుడు మాట్లాడినా " నేను రాజకీయంగా అనేక పదవులు పొందాను, ఎగువ సభ చూశాను, దిగువ సభ చూశాను, శాసనసభ కూడా చూశాను, ఇక నాకు మిగిలింది పై సభే " అని అనేవారంట. సరే, కొంత మంది విషయాలు తెలిసినా, తెలియకపోయినా, సామాజిక స్పృహతో ఉండేవారు ఉంటారు. సామాజిక ఆలోచనతో కొన్ని విషయాలు మాట్లాడుతారు. వారిలో నిరాండబరత్వం ఎక్కువగా ఉండేది. వారి గురించి ఈ సభలో ఈ రకమైన సంతాప ప్రతిపాదన వస్తుందని ఊహించింది కాదు. ఇది అత్యంత దురదృష్టకరం. ద్రోణంరాజుగారి మృతిపట్ల సిపిఐ(ఎం) తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు మా పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ చాడా వెంకట రెడ్డి (ఇందుర్తి) : అధ్యక్షా, ద్రోణంరాజు సత్యనారాయణగారు గత అసెంబ్లీ సమావేశాల్లో ఉండి, ఈనాటి సమావేశాల్లో లేకపోవడం దురదృష్టకరంగా భావిస్తున్నాను. ప్రధానంగా వారు సుత్తాడ గ్రామ కరణంగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, కాలక్రమేణా అనేక పదవులు అలంకరించారు. అనేక ఒడుదుడుకులకు, ఇబ్బందులకు గురైనా, ఆ పదవులకు వన్నె తెచ్చారు. గ్రామ కరణం, మున్సబు పోస్టులను రద్దు చేస్తున్న సమయంలో వాటిని రద్దు చేయకూడదని చెప్పి ఉద్యమాలు నిర్వహించి, పోరాటాలు చేసిన వ్యక్తి. గొప్ప పోరాట పటిమ ఉన్న వ్యక్తి అని ఆయన గుణగణాలను బట్టి పరిశీలించడానికి అవకాశం ఉందని నేను అభిప్రాయపడుతున్నాను. అలాగే వారిలో ఉన్న మంచి మనస్తత్వం ఏమిటంటే, వయస్సు మీద పడుతున్నా, కనిపించినపుడల్లా నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడే వారు. వారి లేని లోటు మన రాష్ట్రానికి తీరనది. మంచి విలువలు కల్గిన రాజకీయ నాయకులు ఒకరి తర్వాత ఒకరు మన మధ్య నుండి దూరమవుతున్నారు. వారి లేని లోటు ఈ సభలో స్పష్టంగా కనపడుతున్నట్లుగా సిపిఐ భావిస్తోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, గౌరవనీయులైన ద్రోణంరాజు సత్యనారాయణగారు ఇంత త్వరగా మృతి చెందుతారని ఎవరూ ఊహించలేదు. ఇటీవల కొంత అస్వస్థతకు గురైనా, సరైనటువంటి వైద్యం జరిగాక, చికిత్స పూర్తయి, ఎలాంటి ఢోకా లేదు మీ ఆరోగ్యానికి, సంపూర్ణమైనటువంటి ఆరోగ్యం మీకు సమకూరింది అని డాక్టర్లు భరోసా ఇస్తే, మరల డిసెంబరులో 3వ తేది నుండి 20వ తేదీ వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా వారు వచ్చి, హాజరు కావడం, వారితో మాట్లాడే అవకాశం కూడా కల్గింది. సంపూర్ణంగా ఆరోగ్యం చేకూరిందని భావించిన తరుణంలో అకస్మాత్తుగా మృత్యువాత పడటం బాధాకరమైన విషయము. గౌరవనీయులైన ముఖ్యమంత్రి, మిగిలిన పెద్దలందరూ మాట్లాడిన ప్రతి మాటతో నేను ఏకీభవిస్తున్నాను.
ఉ.9.10

ద్రోణంరాజుగారు ప్రత్యేకంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం -- ఈ మూడు జిల్లాలకు చెందిన కొన్ని వేలాది మంది కార్యకర్తలను నేరుగా పేరు పెట్టి పిలిచి మాట్లాడే వ్యక్తి. వాళ్లతో చనువుగా ఉండేవారు. ప్రజా జీవితంలో పెరిగిన నాయకులు. మొదట్లో గ్రామ కరణంగా ఉండేవారు. గ్రామోద్యోగుల ఉద్యమానికి సారధ్యం వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామోద్యోగుల వ్యవస్థను రద్దు చేయాలని ఆలోచిస్తున్న సమయంలో దానిని తీవ్రంగా ప్రతిఘటించారు. తాను లోక్‌సభ సభ్యుడిగా ఉన్నా, రాజ్యసభ సభ్యుడిగా ఉన్నా, శాసనసభ్యుడిగా ఉన్నా, గ్రామోద్యోగుల సమస్యల పట్ల ఉన్న మమకారాన్ని, ఆ శ్రద్ధను ఎప్పుడూ విడనాడలేదు. ఇటీవల కూడా వారితో మాట్లాడిన సందర్భంలో, తాను ఉండగా గ్రామోద్యోగుల వ్యవస్థ ఎలా ఉండేది చెప్పుకుంటూ వచ్చారు. వయస్సులో వారికి, మాకు రెండు, మూడు నెలలు హెచ్చుతగ్గులు తప్పా, ఇంచుమించు అంతా ఒకే వయస్సు గల వాళ్లము. ద్రోణంరాజుగారు శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఎప్పుడూ కూడా తాను నవ్వుతూ, నల్గుర్ని నవ్వించే స్వభావం కల్గిన వారు. ప్రజా సమస్యలపైన ఎప్పటికప్పుడు స్పందించేవారు. చక్కటి వాగ్ధాటి గల వారు. సమయోచితంగా మాట్లాడగలిగే వ్యక్తి. ప్రత్యేకంగా పల్లెల్లో మాట్లాడుకునే చిన్న చిన్న సామెతల్ని సమయోచితంగా చెప్పి, బాగా రక్తి కట్టించడంలో వారు దిట్ట. కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంత వరకు వారి మరణం తీవ్రమైనటువంటి లోటు కల్గిస్తోంది. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులు ఈ మరణాన్ని దిగమింగుకుని, ప్రజా జీవితంలో కొనసాగే ధైర్యాన్ని భగవంతుడు వారికి ప్రసాదించాలని మనసారా కోరుతూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

جناب ممتاز احمد خان۔ مسٹر ڈی۔ ستیا نارائینہ صاحب ایک معزز اور نہایت ہی شریف انسان تھے ۔ وہ اس ایوان کے قدیم ترین رکن تھے۔ وہ ہمارے اچھے ساتھی تھے آج وہ ہمارے درمیان میں نہیں ہے۔ ان کے انتقال پر میں اور ہماری پارٹی مجلس اتحاد المسلمین ان کے افراد خاندان کے غم میں برابر کے شریک ہے ۔

---

శ్రీ డి. శ్రీనివాస్ : అధ్యక్షా, శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారు ఈనాడు ఈ సభలో లేకపోవడం చాలా దురదృష్టకరమైన విషయము. నేను అనుకుంటా ఆయన అనుభవించిన ప్రజాప్రతినిధి పదవులను ఈ శాసనసభలో ఎవరూ పొంది ఉండరని. గ్రామ సర్పంచ్ మొదలుకొని, జిల్లా పరిషత్ ఛైర్మన్ వరకు, అదే విధంగా కౌన్సిల్ మెంబర్‌గా, లోకసభ, రాజ్యసభ, శాసనసభ సభ్యులుగా అనేక సభలను రిప్రజెంట్ చేసిన వ్యక్తి. అంతటి అనుభవజ్ఞుడిని ఈనాడు మనం కోల్పోవడం చాలా బాధాకరమైన విషయము. ఆయనలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, మా పార్టీ మీటింగుల్లో కాని, ఇతరత్రా గాని, ఏవైనా **issues** డిస్‌కస్ చేస్తున్నప్పుడు, ఎంత సీరియస్ ఇష్యూ అయినా, మనం ఇబ్బంది పడుతున్న సమయంలో ఆయన ఛలోక్తులు విసిరి, అక్కడి వాతావరణాన్ని కూల్ చేసే వారు. ఆయనకు బ్రహ్మాండమైన చాకచక్యం ఉంది. అపార రాజకీయ అనుభవం గడించిన వారు. కాంగ్రెస్ పార్టీకే కాకుండా, ఈ రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగపడిన వ్యక్తి. బైపాస్ సర్జరీ జరిగి, కోలుకుంటున్న సమయంలో, తిరిగి అనుకోకుండా పరమపదించడం చాలా విచారకరం. గత 25 సంవత్సరాలుగా వారితో నాకు సాన్నిహిత్యం ఉంది. నాకు మంచి సలహాదారుడుగా ఉండేవారు. ఒక మేధావిని కోల్పోయాం. నాకు వ్యక్తిగతంగా చాలా బాధాకరంగా ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థలకు వారి మరణం పెద్ద లోటు అని నేను భావిస్తున్నాను. వారి యొక్క కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ, ద్రోణంరాజుగారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు : అధ్యక్షా, కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణగారు రాజకీయాల్లో రాష్ట్రమంతటికీ పరిచయమైన వ్యక్తి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు. ఆ మూడు జిల్లాల ప్రజలతో అత్యంత సన్నిహిత పరిచయం కల్గిన వ్యక్తి. సత్యనారాయణగారు ఏ సభలో ఉన్నా, ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసం, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి పోరాటం చేసిన వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీలో ఉన్న వారైనా గుర్తిస్తారు.

మేము ఆయన కంటే మూడు దశాబ్దాల వెనుక రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో అనేక సందర్భాల్లో మమ్మల్లనందరినీ ప్రోత్సహించే వ్యక్తిగా ఎప్పటికీ మేము ఆయనను మరువలేము. గత శాసనసభ సమావేశాలు ముగుస్తున్న సందర్భంగా ఈ సభలో వున్నటువంటి కొంతమంది సీనియర్ సభ్యులను నేను భోజనానికి పిలవడం జరిగింది. ద్రోణంరాజు సత్యనారాయణగారి తోబాటు పురుషోత్తమరెడ్డి గారు, విజయరామారావు గారు, సాంబశివరాజు గారు, గాదె వెంకటరెడ్డి గారు తదితరులు ఆహ్వానితుల్లో వున్నారు. ఆ రోజు సుమారు నాలుగు గంటలపాటు రాష్ట్ర రాజకీయాలను గురించి, దేశ రాజకీయాలను గురించి , రాష్ట్రానికి సంబంధించిన వివిధాంశాలను గురించి మేము చర్చించుకోవడం జరిగింది. వారు విశాఖపట్టణానికి వెళ్లిన తరువాత బెడ్ రిడెన్ అయిన విషయం తెలుసుకొని నేను ఆవేదన చెందాను. మన రాష్ట్రంలో చక్కటి పారిశ్రామిక నగరం విశాఖపట్టణం . విశాఖపట్టణ ప్రయోజనాలను కాపాడే విషయంలో సత్యనారాయణ గారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మధ్యవర్తిత్వం నెరపడం, విశాఖకు ప్రాతినిధ్యం వహించడం జరిగింది. అక్కడి ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరువలేరు. ఆయన చనిపోయిన తరువాత విశాఖపట్టణ ప్రయోజనాలను కాపాడడంలో అంత పెద్ద ఎత్తున పనిచేసే సమర్థులు వున్నారా అనే భావం మనందరిలో కలుగుతోందనే విషయం ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఆ ప్రాంతంలోని పరిశ్రమల ప్రయోజనాలను, యితర ప్రయోజనాలను కాపాడడంలో కృషిచేసిన వారిలో సత్యనారాయణగారు ప్రముఖులు. విశాఖపట్నం అంటే ' ద్రోణంరాజు' అనే భావం కలిగే విధంగా అతని ప్రాతినిధ్యం ఆ ప్రాంతంలో వుంది. ఆయన గ్రామస్థాయి నుండి కేంద్రస్థాయి వరకు అన్ని సంస్థలలో రిప్రజెంట్ చేయడం జరిగింది. ఆయన మొదట గ్రామ కరణంగా పనిచేశారు. తదుపరి స్థానిక సంస్థలలో, జిల్లాపరిషత్ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యునిగా పనిచేయడం వల్ల సమస్యలను సమగ్రంగా అవగాహన చేసుకొని అటు మంత్రులకు, ఇటు ప్రజలకు నచ్చచెప్పడంలో కానివ్వండి, పరిష్కారంలో కానివ్వండి ఆయన ప్రముఖ పాత్ర వహించేవారు. ఆయన లేనందున ముఖ్యంగా విశాఖపట్టణానికి తీరనిలోటు కలిగింది. ఆ నష్టం పూడ్చలేనిదిగా విశాఖ ప్రజలు భావిస్తున్న విషయం ఈసందర్భంగా మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపప్రతిపాదనను హృదయపూర్వకంగా బలపరుస్తూ , వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి (హిమాయత్‌నగర్) : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులైన శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారి మృతి పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ సంతాప ప్రతిపాదనను నేను సమర్థిస్తున్నాను. సత్యనారాయణ గారి మృతి పట్ల నా ప్రగాడ సానుభూతిని తెలియజేస్తున్నాను. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సీనియర్ నాయకునిగా, యిప్పుడున్న కాంగ్రెస్ పార్టీలో గాంధీ తరం వారసునిగా పేరు గాంచిన వ్యక్తి ఆయన. కేవలం విశాఖపట్టణ వాసులతోనే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలలోని ప్రజలతో, కార్యకర్తలతో సత్సంబంధాలు పెట్టుకొని , ఎన్నికల్లో గెలిచినా, ఓడినా, పదవిలో వున్నా లేకపోయినా ద్రోణంరాజు గారు రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను, స్థానాన్ని ఉత్తరాంధ్ర జిల్లాలలో స్థాపించుకున్న వ్యక్తి. వారి మృతి ఉత్తరాంధ్ర జిల్లాలకు తీరని లోటు అని తెలియజేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ , వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యు. పురుషోత్తమ రెడ్డి (రామన్నపేట): అధ్యక్షా, 1975 ప్రారంభంలో విశాఖపట్టణంలో ఇందిరాగాంధీ గారి సభను ఏర్పాటు చేయడం జరిగింది. సంజయ్ గాంధీ రాజకీయ పరిచయం కూడా విశాఖపట్టణంలో జరిగింది. అప్పుడు నాకు ద్రోణంరాజు సత్యనారాయణ గారు పరిచయం అయినారు. అప్పుడు ఆయన మామూలు కరణంగా వుండేవారు. అప్పట్లో సాగి సూర్యనారాయణ రాజు మంత్రిగారు. సాగి సీతారామరాజు గారు జిల్లా పరిషత్ అధ్యక్షులు . భాట్టం శ్రీరామమూర్తి గారు మంత్రిగారు. వీరంతా దిగ్గజాలు. వారి మధ్యకు ఎవరు పోయినా నలిగిపోవలసిందే. ద్రోణంరాజు గారు ఎంతో చాకచక్యంగా

తనకంటూ ఒక స్థానం సంపాదించుకొని , రెండు వర్గాలకు సన్నిహితంగా మెలగుతూ విశాఖపట్నంలో ముస్ముందుగా తనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నారు. తదుపరి వారు ఎంతగా ఎదిగారంటే శాసనసభ సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, లోక్‌సభ సభ్యునిగా, హుడా చైర్మన్‌గా, జిల్లా పరిషత్ అధ్యక్షునిగా అయినారు. రాజశేఖరరెడ్డి గారు చెప్పినట్లుగా ఆయన వారికి ఎంతో సన్నిహితంగా వుండే వారు. ఎంత సన్నిహితం అంటే ద్రోణం గారికి రాజశేఖర రెడ్డిగారు యింత యింపార్టెన్స్ యిస్తారా అని మేము ఒక్కొక్కసారి ఈర్ష్య చెందే వారము . కానీ అతనికి ఒక శాపం తగిలింది. రాజశేఖర రెడ్డి పదవుల్లో లేనప్పుడు చాలా సన్నిహితం, ముఖ్యమంత్రి అయ్యే టైమ్‌కి దూరం . నాకూ ఆ జాడ్యం వుంది. మేము యిరువురం చాలా దగ్గరగా వుండే వారము. ఎంత దగ్గరంటే యిరవై సంవత్సరాల పాటు రాజశేఖర రెడ్డి మేలు కోరే వారం . అదంతా గడచిపోయింది . ధర్మాన ప్రసాదరావు గారి ఊహకు ఎందుకు తోచిందో లేక రాబోయే రోజుల్లో జరగబోయేది ఆయన ఊహకు భాసించిందో తెలియదు గాని మా ముసలి వారందరితో ' నేను భోజనానికి ఆహ్వానిస్తున్నాను, మీరంతా రావాలి' అని ఆయన అన్నారు. నేను అక్కడికి వెళ్లే వరకు గాదె వెంకటరెడ్డిగారు, చంగారెడ్డిగారు, సాంబశివరాజు గారు, ద్రోణంరాజు గారు వున్నారు. ఇది చాలా బాగుంది, మా తరానికి కొంత మర్యాద యిచ్చారు , బ్రహ్మాండం అని అనుకున్నాము. అక్కడ ద్రోణంరాజు గారి ఆరోగ్యం గురించి సంభాషణ దొర్లింది. ' ద్రోణం నీకు చావు లేదురా యిప్పట్లో ' అన్నాను. ' ఎందుకు' అని ఆయన అడుగుతే ' నీకు చావంటూ వస్తే ఎయిడ్స్ వల్ల రావాలి. ఇప్పుడు, ఈ వయసులో ఎయిడ్స్ వచ్చే అవకాశం లేదు. కాబట్టి నీవు చనిపోవు' అని అన్న నాలుగైదు రోజుల తరువాత ఇది జరిగింది. ఆయన నాతో కూడా ఎంతో సన్నిహితంగా వుండే వారు. ఎప్పుడూ ఛలోక్తులు, పిట్టకథలు చెబుతూ తాను నవ్వుతూ పదుగురిని నవ్విస్తూ ఎవరికీ బాధ కలుగకుండా నడచుకునే వ్యక్తి చనిపోవడం చాలా బాధాకరమని మనవి చేస్తున్నాను. ఆయన పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడేవారు. పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడాలంటే ఎంతో ధైర్యం కావాలి. ఆయనకు ముందు ఎవరైనా తెలుగులో మాట్లాడే వారేమో నాకు తెలియదు. అన్ని రంగాల్లో, కళల్లో ఆయన పాల్గొనేవారు. ఎంతో చాతుర్యం కలిగిన రాజకీయ నిపుణుడు, అత్యంత మేధావి చనిపోవడం మనందరికీ నష్టదాయకం . ఆయనను 'ద్రోణాచార్య' అనే వారము. ఆయన ఆత్మకు శాంతి కలగాలంటే మన ముఖ్యమంత్రిగారు ఆయన కుమారునికి ఏదయినా ఏర్పాటు చేసినట్లయితే బాగుంటుంది. ద్రోణంరాజు గారి పేరు మీద విశాఖపట్నంలో ఒక స్థూపం ఏర్పాటు చేయాలని మనవి చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.9.30

శ్రీ జి. దేముడు (చింతపల్లి) : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ కీర్తి శేషులు ద్రోణంరాజు సత్యనారాయణ గారు మా ఉత్తరాంధ్ర జిల్లాలలోని అన్ని పార్టీల వారికీ కూడా మంచి మిత్రుడని తెలియజేస్తున్నాను. ఎవరికీ కూడ వ్యతిరేకి కారు. డీడీఆర్‌సీ మీటింగ్సులో గాని, జడ్‌పి మీటింగ్సులో గాని మాట్లాడేటప్పుడు మాలాంటి వాళ్లను ముందుగా పిలిచి, ఈ సమస్యలున్నాయి, వీటిని ఈ విధంగా అడగమని ఎంతో ఇదిగా చెప్పేవారు. ద్రోణుడు అర్జునుడికి గురువు అయితే, ఉత్తరాంధ్రలో రాజకీయ నాయకులు చాలా మందికి ద్రోణం రాజు గారు గురువులాంటి వారు. అందరినీ ఆయన ఆప్యాయంగా పిలిచేవారు. కొత్త సభ్యులను పిలిచి ఏ విధంగా సభలో వ్యవహరించాలో, ఏ అంశాన్ని ఎలా మాట్లాడితే పరిష్కారం అవుతుందో, దానిని ఎలా తీసుకురావాలో బోధించేవారు. నేను కూడా అదే జిల్లాకు చెందిన వాడిని. ఎప్పుడూ సరదాగా మాట్లాడేవారు. వారి కుటుంబ సభ్యులందరూ నాకు తెలుసు. అటువంటి వారు స్వర్గస్థులు కావడం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలలో, ముఖ్యంగా విశాఖ జిల్లాలో రాజకీయంగా సలహా చెప్పే గురువు లేనట్లే నని నా అభిప్రాయం. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని మనసారా కాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి కె. ప్రభావతమ్మ (రాజంపేట) : అధ్యక్షా, ద్రోణంరాజు గారు 1978–82 సంవత్సరాల మధ్య ఎమ్మెల్యేగా ఉన్నపుడు నాకు పరిచయం. పదిహేను, ఇరవై మంది ఎమ్మెల్యేలందరినీ ఒక యూనిట్‌గా చేసి, ఎవరికి ఏ పని ఉన్నా అందరం కలసికట్టుగా వెళ్లాలని చెప్పి, మా అందరితో కలిసి తిరిగేవారు. మంచి స్నేహితుడు. మంచి మాటకారి. సమస్యల్ని పరిష్కరించగలిగే దిట్ట. ఈ మధ్య శాసనసభలో '' అలా ఉన్నారేమిటి, ఆరోగ్యం బాగా లేకపోతే ఎందుకు వస్తున్నారు '' అని అడిగితే '' ఇక్కడకు వస్తేనే నాకు హుషారుగా ఉంటుంది'' అని చెప్పేవాడు. అటువంటి మంచి మనిషి మన మధ్య లేకపోవడం మన దురదృష్టం. మనసుకు బాధ కలిగించే విషయం. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె వెంకట రెడ్డి (బాపట్ల): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ద్రోణంరాజు సత్యనారాయణ గారు నాకు దాదాపు 30 సంవత్సరాల నుంచి పరిచయం. మొట్ట మొదట నేను శాసన సభ్యుడిని అయినపుడు చాలా చిన్న వయసులో చాలా యాక్టివ్‌గా ఉండేవాడిని. ఇప్పుడు అంత లేననుకోండీ. శాసనసభ కార్యక్రమాలలో కూడా అలా ఉండేవాడిని. అప్పుడు బ్రహ్మానందరెడ్డి గారు ముఖ్యమంత్రి . అప్పుడు '' ఎవరీ వెంకట రెడ్డి '' అనే పద్ధతిలో ద్రోణం రాజు గారు అడగటం, నాకు పరిచయం కావడం జరిగింది. నేను కూడా మున్సబు కుటుంబంలో పుట్టిన వాడిని. మా నాన్న గారు, తాత గారు కూడా గ్రామాధికారుల వ్యవస్థలో పని చేశారు. అందువల్ల మా ఇద్దరికీ బాగా పరిచయం ఏర్పడింది. బ్రిటిష్ ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన గ్రామాధికారుల వ్యవస్థలో అక్కడ మున్సబు అయితే ఇక్కడ పటేల్ అనేవారు. వారికి కొంచెం ఎక్కువ అధికారాలు ఉండేవి. కరణాలు అంటే లెక్కలు, శిస్తులు వసూలు వంటి వ్యవహారాలుండేవి. ఆనాడు చాలా ఉన్నతమైన గ్రామాధికారుల వ్యవస్థ ఉండేదని చెప్పకతప్పదు. కాలక్రమేణా ప్రభుత్వాలు మారేయి. గ్రామాధికారుల వ్యవస్థను రద్దు చేయాలని ఆనాడు ఆలోచన కలిగినపుడు, దానిని గురించి సుప్రీం కోర్టు వరకూ వెళ్లి ఫైట్ ఇవ్వడం జరిగింది. 'హెరిడిటరీ ' ని తీసివేశారు గానీ మళ్లీ గ్రామాధికారుల వ్యవస్థను పునరుద్ధరించడానికి మంచి కృషి చేసిన వ్యక్తి ద్రోణంరాజు సత్యనారాయణ గారని గ్రామాధికారులందరూ జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈనాడు సెక్రటరీ సిస్టం వచ్చింది. రెవెన్యూ రికార్డుల్లో ఎవరి పొలం ఎవరిదో, హద్దులేవో తెలియవు.

ముఖ్యమంత్రి గారికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. కనీసం రెవెన్యూకి సంబంధించి, దాని మెయింటెనెన్సు, వాటర్ శిస్తు వసూలు చేయడం చేయడం వంటి విషయంలో, వారిని తీసివేయమని చెప్పడం కాదు గానీ, మళ్లీ ఆ రికార్డుల్ని పెర్ఫెక్ట్‌గా తీసుకువచ్చి, ఎవరి పొలాలు ఎక్కడో, ఆ వివరాలు తెలియకపోతే గ్రామీణ వ్యవస్థ దెబ్బ తింటుందని మనవి చేస్తున్నాను. కాబట్టి దీనిని పరిశీలించాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

ఇంకో విషయం. ఉత్తరాంధ్రలో ద్రోణంరాజు సత్యనారాయణ గారు బాగా చతురత కలిగిన, మాట చతురత కలిగిన వ్యక్తి. ధర్మాన ప్రసాదరావు గారు, రోశయ్య గారు చెప్పినట్లు ఆయన సంతోషపడుతూ, ఇతరులను సంతోషపెడుతూ నవ్వించేవాడు. ఇంకోటి మనవి చేయాలి. పురుషోత్తమ రెడ్డి గారు చెప్పారు. రాజశేఖర రెడ్డి గారికి దాదాపు 15–20 సంవత్సరాలు అనుచరుడు అనను గాని, సహచరుడు గా ఉండి రాజకీయంగా వారి పెరుగుదలకు ఆయన కూడా ఒక కారకుడు. అయితే దురదృష్టం ఏమిటంటే, వారికి ఒక కోరిక ఉండేది, మంత్రివర్గంలో స్థానం కావాలని కోరికతో బాటు, తప్పకుండా వస్తుందని ఆశ పడ్డారు. ఆయన బ్రతికుంటే వచ్చేదేమో తెలియదు గాని, వారికి ఆ దుగ్ధ, చింత ఉండేదని మనవి చేస్తున్నాను. అంతేకాదు, రాజకీయాలలో ' లాయల్టీస్ ' అనేవి ఉండవని నేను అనుకుంటాను. ' loyalty ' అనే దానికి అర్థం లేదు. Likes & dislikes అనేవి, admiration, admirers అనేవి తప్పితే వేరేవి ఉండవు. చరిత్ర ఆలోచిస్తే బ్రహ్మానంద రెడ్డి గారు, సంజీవరెడ్డి గారు, పి.వి. నరసింహారావు గారు –– ఇవన్నీ ఆలోచిస్తే there is no place for loyalty in politics except likes and dislikes.

అందువల్ల మనవి చేసేది, ద్రోణంరాజు చాలా చరిత్ర కలిగిన వ్యక్తి. చాలామంది ఆయన శిష్యులు, పెంచిన వారు మంత్రులు అయ్యారు తప్పితే, ఆయన కాలేదన్న భావన ఆయనకు ఉండే ది. మళ్లీ వారికి సీటు ఇచ్చారు సంతోషం. రాజశేఖర రెడ్డి గారు ద్రోణంరాజు గారి మీద ప్రేమతో, అభిమానంతో వారి కుమారుడికి సీటు ఇచ్చారు. వారు గెలుస్తారన్న ఆశ ఉంది. వారికి సరైన రికగ్నిషను ఉంది. ఇప్పటికైనా ఇస్తే బాగుంటుందనుకునే వ్యక్తిని నేను. వారు బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కొమిరెడ్డి రాములు (మెట్‌పల్లి ): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా సమర్థిస్తూ కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ గారు ఈ శాసనసభలో ఉన్న మేధావులలో ఒకరు. చాలా గొప్ప వ్యక్తి. పెద్ద పర్సనాలిటీ. వారు లేని లోటు తప్పనిసరిగా ఈ హౌసులో గాని, రాష్ట్రంలో గాని ఉంది. ఆయన ఫాలోయర్సుపై ఎంత నమ్మకం అంటే, గతంలో బాలరాజు అనే ఆయన కిడ్నాప్ అయితే ఆయన కొడుకో, లేక కుటుంబ సభ్యుడో కిడ్నాప్ అయినట్లుగా బాధపడి, రాష్ట్రాన్ని, రాష్ట్రంలో ఉన్న ఎడ్మినిస్ట్రేషన్ను ఒకటి చేసి, ఆయన్ను తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా ఇక్కడ మేము ఎప్పుడు కలిసినా బాగా పలకరించి, మంచి సలహాలు ఇచ్చేవారు. ఈ విధంగా పని చేసుకోవాలని సలహాలిచ్చేవారు. గాదె వెంకట రెడ్డి గారు చెప్పినట్లు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీలో గాని, బయట గాని ప్రతిసారీ అందరికీ మంచి సలహాలు ఇచ్చేవారు. ఈ హౌసులో ఆయన లేకపోవడం చాలా తీరని లోటని నేను భావిస్తున్నాను.

ఉ. 9 .40

అలాగే విశాఖపట్టణంలో వారి స్థూపాన్నిగానీ, లేక వారిపేరున ఏదైనా ఇనిస్టిట్యూషన్‌ను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను .

శ్రీ ఎన్ రఘువీరా రెడ్డి : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు సభముందు ఉంచిన ఈ తీర్మానాన్ని బలపరుస్తూ, గౌరవనీయులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారి మృతిపట్ల బాధను వ్యక్తం చేస్తున్నాను . వారి వయసు 72 సంవత్సరాలయినా దాదాపు 32, 34 సంవత్సరాల తక్కువ వయస్సు ఉన్న మాతో కూడా ఏ మాత్రం కూడా వయసులో పెద్దవాడిని, రాజకీయాలలో సీనియర్‌ను అని ఎప్పుడూ భావించలేదు . అందరినీ సమానంగా చూస్తూ, ఎప్పుడూ కూడా ఎటువంటి పరిస్థితి ఉన్నా నవ్విస్తూ , అనేకమైన విషయాలు మాతో పంచుకునే వారు . చిన్న పెద్ద బేధం లేకుండా అందరినీ కలుపుకుని పోయే గుణం కలవారు . వారి రాజకీయ చరిత్ర తీసుకుంటే, ఒకవైపు అస్థవ్యస్థమవుతున్న గ్రామ పరిపాలనను బలోపేతం చేయాలనీ, మరొకవైపు స్థానిక సంస్థలకు ప్రభుత్వం పూర్తి అధికారాలు ఇవ్వాలని భావించేవారు . వీటి సాధనకోసం అనేక ప్రయత్నాలు చేసి రెంటినీ రెండు కళ్లుగా భావించేవారు . స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణగారు చేసిన ఈ ప్రయత్నాలు ప్రభుత్వానికి చాలా ఉపయోగంగా స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ, గ్రామపాలన అస్థవ్యస్థం కాకుండా దానికి మరొకవైపు బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు . ఇటీవలనేను రెండురోజుల ఎన్నికల క్యాంపైన్ గురించి వైజాగ్ వెళ్లినపుడు కులమతాలకు అతీతంగా ఎక్కడ స్లమ్స్‌కు వెళ్లినా కూడా అక్కడి ప్రజలకు వారిపట్ల భక్తి వారు చూపిస్తున్న శ్రద్ధ అపారమైనది అని నేను అక్కడకు వెళ్లిన తరువాత అర్థం అయింది . దాదాపు నాలుగు దశాబ్దాలు రాజకీయాలలో ఉన్నారు . ఇప్పటి పరిస్థితులలో రెండు టెరంలు చేస్తే ఫేడవుట్ అయ్యే పరిస్థితులు ఉన్నాయి . అటువంటిది నాలుగు దశాబ్దాలు రాజకీయాలలో అంత గౌరవనీయంగా ఉండగలిగారు అంటే ఆయనకే సాధ్యం అయింది . వారి మరణం వారి కానిస్టిట్యుయెన్సీకి చాతా తీవ్రమైన లోటు . అటువంటి వారి గైడెన్స్ లేకపోవడం యువకులుగా రాజకీయాలలో ఉన్న మాలాంటి వారికి చాలా లోటని ఈ సందర్భంగా భావిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను .

••శ్రీ మందాడి సత్యనారాయణ రెడ్డి (హన్మకొండ): అధ్యక్షా, శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారికి నాకు చాలా తక్కువ పరిచయం, ఈ సభలోకి వచ్చిన తరువాత మొట్టమొదట ప్రత్యక్షంగా చూశానుగానీ అనేక సంవత్సరాలుగా ప్రజాజీవితంలో ఉన్న కారణంగా, అనేక సంవత్సరాలుగా ద్రోణంరాజు గారి గురించి పత్రికలలో, వాళ్లు, వీళ్లు చెపింది విన్నాను . కాంగ్రెస్‌పార్టీ దిగ్గజాలలో ఆయన ఒకరుగా పేరుపొందారు . కాంగ్రెస్‌పార్టీ గౌరవించదగిన నాయకులలో ఆయన ఒకరు . ఆయనతో నాకు చాలా తక్కువ పరిచయం అయినా ఒక సంఘటన నన్ను బాగా ఆకట్టుకుంది . ఒకరోజు హోంమినిస్టరుతో ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడానికి అసెంబ్లీలో ఆయన రూంకు వెళితే ఆ రిప్రజెంటేషన్ సరిగా రాయలేదు, వ్యాకరణం భాష బాగాలేదు, అని చర్చిస్తూ ఆలస్యం చేశారు . మినిస్టరుగారు వెళడానికి తొందర పడుతున్నారు . అప్పుడు నేను వ్యాకరణం భాషకు ముప్పు, గ్రామానికి కరణం ముప్పు అనే మాట ఎప్పటి నుండో సామెత అంటారు అని నేనన్నాను . ఆ సందర్భంగా ద్రోణంరాజుగారు కూడా అక్కడే వున్నారు గానీ వారిని నేను గమనించలేదు . వారు వెంటనే నా భుజం పైన చేయవేసి తప్పుచేస్తే ముప్పు వస్తుంది గానీ తప్పులేకపోతే ముప్పు ఉండదు అన్నారు . నేను సారీ, మీరు ఉన్నారని అనుకోలేదని అన్నాను . లీడర్ అంటే ఆయనలా ఉండాలి. ద్రోణంరాజుగారిని చూస్తే ఆయన లోపల ఎంత బాధ ఉన్నా కుటుంబ బాధ, పార్టీ బాధ, ఆరోగ్యబాధ ఎంతగా ఉన్నా పైకి చాలా ఉల్లాసంగా నవ్వుతూ కనిపించినపుడు, మన దగ్గరకు వచ్చిన ప్రజలు వారి బాధలు వ్యక్తం చేస్తారు . ప్రజలు కష్టాలు చెప్పుకోడానికి వస్తే, లీడరు పెళ్లాం పోయినట్లు ఏడుస్తూ కూర్చుంటే వీడే బాధలో ఉన్నాడు, మనకేమి చేస్తాడని ప్రజలు నీరుగారుతారు . లీడరు పెద్దమనసుతో నవ్వుతూ, ఇతరుల బాధలు తీర్చేవిధంగా ఉంటే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది . చట్ట సభలలో అటువంటి నాయకులు చేసే చర్చల ద్వారా మేము చాలా నేర్చుకుంటున్నాము . మా పార్టీ శాసనసభ్యుని చూచి నేర్చుకోండి అనే పద్ధతిలో ఉండాలంటే ద్రోణంరాజుగారిని అన్నిపార్టీలు ఆదర్శంగా తీసుకోవాలి. పెడబొబ్బలు పెట్టి – మైకులు విరగగొట్టి చట్ట సభల గౌరవాన్ని మంట గలిపే వ్యక్తులు కూడా ఎన్నికవుతున్న ఈ రోజుల్లో ద్రోణంరాజులాంటి ఉత్తముల అవసరం చాలా వుంది. కొత్తగా ప్రజాజీవితంలోకి వచ్చి చట్టసభలలోకి వస్తున్నవారు ద్రోణంరాజుగారిని చూచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది . నేను కూడా నేర్చుకోవలసింది ఎంతో ఉంది . అలాంటి ఉత్తమ రాజకీయవేత్త, కాంగ్రెస్‌పార్టీకి దిగ్గజం గా ఉండి, ఆదర్శ రాజకీయవాదిగా, శాసనసభ్యునిగా ఉన్న పెద్దమనిషిని కోల్పోవడం మన దురదృష్టం . వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను .

శ్రీ ఆర్ . చెంగారెడ్డి (నగరి): అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మిత్రులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణగారి ఆకాల మృతి వూహాంచనిది . వారి మరణం ఎంతోమందిని కలచివేసిన విషయం మా అందరికీ తెలుసు . ముఖ్యంగా ద్రోణంరాజుగారితో నాకు 1977 నుండి సన్నిహిత సంబంధం ఉంది . 77 సంవత్సరంలో శాసనసభ్యునిగా అయినప్పటినుండి వారు పార్లమెంటు సభ్యునిగా ఉన్నప్పుడు కూడా ఇక్కడ డా . చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మేమంతా కలిసి వుండేవాళ్లం . మా స్నేహం నేను మంత్రి అయిన తరువాత 1989 లో అదృష్టవశాత్తు వారి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నాను . ఆ జిల్లా అభివృద్ధికి వారు ఏ విధంగా ప్రయత్నాలు చేశారో, ఏ విధంగా అభివృద్ధి చేశారో చూస్తే నిజంగా వారు ప్రజలందరి మనసులలో మంచిపేరు సంపాదించారు . ఉత్తరాంధ్రలో చక్రం తిప్పి రాజకీయాలలో వేరే పార్టీలకు ఏ మాత్రం చోటు లేకుండా చిన్న చిన్న నాయకులను పైకి తేవడం జరిగింది . ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ పరిపాలనలో అవినీతి ఆరోపణలు వచ్చినపుడు ధైర్యంగా సుప్రీంకోర్టులు, హైకోర్టులలో వారిపార్టీమీద ఆరోపణలు చేసి సాధించిన ఘనత ద్రోణంరాణుగారికే దక్కింది . ఆటువంటి వ్యక్తి ఈ రోజున మధ్య లేకపోవడం చాలా బాధ కలిగిస్తుంది . రోజూ కలుసుకునే వాళ్లం . ఆయన మృతికి సుమారు 4 రోజుల ముందు ప్రసాదరావు గారింట్లో కలవడం, గ్రామస్థాయి నుండి, జిల్లా, రాష్ట్ర దేశస్థాయి వరకు కలిసి రాజకీయాలు మాట్లాడి ఎంతో సంతోషంగా గడిపిన

•• An asterisk before the name indicates confirmation by the Member.

రోజులు ఇంకా రావని అనుకుంటున్నాను . ద్రోణంరాజుగారికి మంచి సమయస్ఫూర్తి, సమయోచితంగా వారు మాట్లాడే మాటలు అందిరిని నవ్వించి సంతోషంగా వుంచిన మా నాయకుడు ఇప్పుడ లేరు .

ఉ.9.50

మన మిత్రులు చెప్పినట్లుగా, అందరి మనసులలో వారు చిరస్థాయిగా వుండేటట్లుగా, వారి జ్ఞాపకార్థం ఒక స్థూపం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి గారికి ఈ సందర్భంగా మనవి చేస్తూ, వారి మరణానికి నా ప్రగాడ సానుభూతిని వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని కలుగజేయాలని ఆ భగవంతుని కోరుకుంటూ, మాట్లాడేందుకు నాకు ఈ అవకాశాన్నిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చనుమోలు వెంకట్రావు(మైలవరం) ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారు చాలా సీనియర్ నాయకులు, ఆయనతో నాకు 1975 నుంచీ పరిచయం వుంది. వివిధ హోదాలలో పనిచేసారు, శాసన సభ సభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, గ్రామ స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకూ ఎదిగిన అనుభవజ్ఞుడైన నాయకులు. గ్రామీణ వ్యవస్థ, గ్రామాధికారుల వ్యవస్థ ఛిన్నాభిన్నమైన తరువాత, గ్రామ వ్యవస్థలో రికార్డులు సక్రమంగా వుండడం లేదని బాధ పడుతూ వుండేవారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో చాలా మంది రాజకీయ నాయకులను తయారు చేసి, ఒక ప్రత్యేకతను తనక ంటూ సంపాదించుకున్న మహా నాయకుడు.

ప్రజా సమస్యల పట్ల ఎప్పటికపుడు తనదైన శైలిలో స్పందిస్తూ, ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేవారు. ఆయనలో వున్న ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ఢిల్లీలో వున్నా, హైదరాబాదులో వున్నా, విశాఖపట్నంలో వున్నా, మనం ఆయన దగ్గరకు వెళితే, భోజనాలు వంటి సౌకర్యాలను కలుగజేసేవారు. శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారితో నేను చాలా సంవత్సరాలు కలిసిమెలిసి పనిచేసాను. ఆ పరిచయంలో వారితో మరువలేని సంఘటనలు చాలా వున్నాయి. ఆయన లేని లోటు కాంగ్రెస్ పార్టీకీ, ఉత్తరాంధ్ర ప్రజలకూ, ఈ రాష్ట్రానికీ చాలా తీరని లోటు. ఆయన మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతినీ తెలుపుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఆయన వారసునిగా, ఆ నియోజక వర్గంలో వారి కుమారుని నిలబెట్టినందుకు ముఖ్యమంత్రిగారిని అభినందిస్తూ, శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారి కుమారుడు విజయం సాధించి, వారి తండ్రిగారు నడిపించినట్లుగానే మంచి రాజకీయాలను వీరు కూడా కొనసాగిస్తారని భావిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.జనార్ధన రెడ్డి (ఖైరతాబాద్) ః అధ్యక్షా, శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారి మృతి పట్ల మన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి నా మద్దతు తెలియజేస్తున్నాను. నేను కొత్తగా శాసన సభ్యుడనైనపుడు, 1980లో ద్రోణంరాజు సత్యనారాయణ గారితో పరిచయమైంది. అనేక ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి ఆయన. అంతే కాదు బాగా కష్టపడి పనిచేసే మనస్తత్వం వున్న వ్యక్తి కూడా. వారు అందరితో చాలా సన్నిహితంగా వుండేవారు. 1985లో అంజయ్యగారు కార్మిక శాఖా మంత్రిగా వున్నపుడు నన్ను ట్రేడ్ యూనియన్ రాజకీయాలలోకి రమ్మని ఎంతో ప్రోత్సహించి, బి.హెచ్.పి.వి.లో కంటెస్ట్ చేయించడం జరిగింది, వారు నాకు మద్దతుగా నిలబడడం కూడా జరిగింది.

స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా వున్నపుడు, ఆయనను ఎదిరించాలంటే ఎవరైనా సంకోచించే రోజులలో ఎన్.టి. రామారావు గారిపై పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ వేసి, ఆయనపై కరప్షన్ ఛార్జెస్ పెట్టి, అడ్వొకేటు రామచంద్రరావు గారి ద్వారా కేసు వేసి గెలవడం జరిగింది. ఆ సంఘటనతో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైనది. ఆ తరువాత కాలంలో 1989లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగింది.

పార్టీ గురించి వారు ఎన్నో త్యాగాలు చేసారు, ఎంతో మందిని నాయకులుగా, శాసన సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా చేసారు. వారి జన్మదినం సందర్భంగా మొన్న జరిగిన కార్యక్రమానికి ఎంతోమంది జనం రావడం జరిగింది. ఒక రాజ్యసభ సభ్యుడుగా, శాసన సభ్యుడిగా, ' ఉడా ' ఛైర్మన్‌గా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, ఉత్తరాంధ్రా ప్రాంతానికే కాకుండా యావదాంధ్ర రాష్ట్రానికే ఎన్నో ఉత్తమమైన సేవలను అందించడం జరిగింది. అటువంటి వ్యక్తి మన మధ్యన లేనందుకు చాలా బాధ కలుగుతోంది. వారి మృతికి సంతాప సూచకంగా వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢమైన సానుభూతినీ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతునీ కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్.సంతోష్ రెడ్డి (ఆర్మూరు): అధ్యక్షా, కనులు తెరిస్తే జననం, కనులు మూస్తే మరణం . రెప్పపాటులో జరిగే జీవితమే మన జీవన ప్రస్థానం . శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారు నాకు 1980 నుంచీ మంచి మిత్రుడు. తర తరానికీ మారుతున్న అంతరాన్ని పూరించడానికి అద్దం పట్టే మనస్తత్వం వున్న వ్యక్తి, చిన్న పిల్లల్లో చిన్న వాడుగా, పెద్ద వారిలో ఇంకా పెద్దవాడిగా ముద్ర వేసుకుని, తాను నవ్వుతూ, ఇతరులను నవ్విస్తూ వుండే మనస్తత్వం వున్న వ్యక్తి శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ.

1989లో చెంగారెడ్డిగారు పంచాయతీరాజ్ మంత్రిగా వున్నపుడు, ఆనాడు ముఖ్యమంత్రిగా స్వర్గీయ చెన్నారెడ్డిగారు వున్నారు. నా దగ్గరకు చెంగారెడ్డి గారూ, ద్రోణంరాజు సత్యనారాయణ గారూ వచ్చారు. నన్ను ఆర్.టి.సి. ఛైర్మన్‌గా నియమించడానికి ప్రతిపాదించి, రేపే ఆర్డర్ ఇప్పిస్తాము, దయచేసి ఒప్పుకోండని రిక్వస్ట్ చేసారు. నేను ద్రోణంరాజు సత్యనారాయణ గారికి చెప్పాను. మీరు అనర్గళంగా మాట్లాడగలరు, మంచి ఉపన్యాసకులు, కార్మికులతో చాలా సన్నిహిత సంబంధాలున్నాయి, ఆ పదవిని మీరే తీసుకోండి, నాకు ఒక అభిప్రాయం వుంది, అయితే డైరక్ట్‌గా మంత్రిని అవుతాను, లేకపోతే లేదని చెప్పాను. ఆయన నన్ను ఒప్పించడానికి చాలా ప్రయత్నం చేసారు. అటువంటి వ్యక్తి, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక మంచి నాయకుడు, ఎంతో మంది శిష్యులను తయారు చేసిన ఒక మహానుభావుడు. వారి మరణం పట్ల వారి కుటుంబానికి నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, ఈ సందర్భంగా వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, నేను సెలవు తీసుకుంటున్నాను.

డా. కె.రవిబాబు (ఎస్.కోట) : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ గారు రాష్ట్ర రాజకీయాలలో ఒక చెరగని ముద్ర వేసారు. ముఖ్యంగా విశాఖపట్నం, పరిసర ప్రాంతాలలో వేలాది మంది శిష్యులను తయారుచేసిన ఘనత వారికే దక్కుతుంది. రాజకీయాలలో నైతిక విలువలు కావాలని కోరుకుని, అటువంటి నైతిక విలువలను పాటించిన ఒక ప్రజా ప్రతినిధిగా వుండి, ప్రజలకు సంపూర్ణమైన విశ్వాసంతో పని చేయాలని, భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో పల్లె నుంచి పార్లమెంటు దాకా అన్ని స్థాయిలలో ప్రజాప్రతినిధిగా పనిచేసి, అపూర్వమైన ప్రజల యొక్క విశ్వాసాన్ని పొందిన మనిషి ద్రోణంరాజు సత్యనారాయణ గారు.

ఉ.10.00

ముఖ్యంగా, కోస్తా ఆంధ్రలో వారి శిష్యులని చెప్పుకోడానికి వేలాది మంది నాయకులున్నారంటే, అది అతిశయోక్తి కాదు. గత 20 సంవత్సరాల నుండి ఆంధ్ర యూనివర్సిటి పరిధిలో చూస్తే, ఆంధ్ర యూనివర్సిటిలో జరిగే ప్రతి రాజకీయ

కార్యక్రమాలలో, రాజకీయ ఉపన్యాస కార్యక్రమాలలో ఆయన లేకుండా ఏ కార్యక్రమాలు జరిగేవి కావు. మంచి ఆలోచనాపరుడు. వారు భారతీయ సమాజంపట్ల,గ్రామాల పట్ల, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పట్ల, గ్రామాల స్వయం పరిపాలనపట్ల, ఒక ప్రత్యేకమైన ఆలోచనాసరళి ఉన్న మహామనిషి. యూనివర్సిటీలో మేము చదువుకునే రోజులలో ఎన్నో సంధర్భాలలో వారిని యూనివర్సిటీలో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించినప్పుడు అనర్గళంగా అన్ని విషయాలపట్ల మాట్లాడేవారు. వారు మాట్లాడేమాటలు మాలాంటివారికి ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయి. ఇప్పటికి కూడా అంటే, వారు మొన్న చనిపోయిన రోజున విశాఖపట్టణంలో ఉన్న పరిస్థితి గమనిస్తే వేలాది మంది ప్రజానీకం ఒక మంచి రాజకీయ గురువుని కోల్పోయామనే ఆవేదనను వ్యక్తపరచారు. నిజానికి ఆయన ఒక రకమైన రాజకీయ పాఠశాలగా పని చేశారంటే అది అతిశయోక్తి కాదు. ముఖ్యంగా పేద ప్రజల పట్ల , చదువుకునే విద్యార్థులపట్ల, ఎంతో అమూల్యమైన ఆదరణతో ముమ్మలనందరిని చూసే వారు.

ఆంధ్ర యూనివర్సిటి పరిధి కార్యక్రమాలలో భాగస్వామి అయ్యేవారు. చాలా వేదికల మీద అంటే దాదాపు వందలాది వేదికల మీద వారిని చూసేవారము. ఏ విషయం పట్ల ప్రజలను చైతన్యం చేయాలనే ఆలోచన వారి మనసులో ఎప్పుడూ తెప్పిస్తూ ఉండేది. చాలా మంది పెద్దలు వారి గురించి సభలో మాట్లాడితే చాలా విషయాలు రాష్ట్ర ప్రజానీకం గమనిస్తున్నారు. వారి నుండి మేము నేర్చుకున్న అంశాలు చాలా ఉన్నాయి. రాజకీయాలలో ప్రజాప్రతినిధిగా ఉన్న మనిషి, నైతిక విలువలు పాటించాలి, ప్రజలకు ఒక జవాబుదారీతనంగా వ్యవహరించాలని వారు అంటు ఉండేవారు. వారి ఆలోచన నిజంగా సమర్థనీయమైన ఆలోచన. అటువంటి ఉన్నత రాజకీయ విలువలు కలిగిన మహనీయులు ఈ రోజు మన మధ్యన లేకుండా ఉండడం దురదృష్టకరం. వారి మరణం రాష్ట్ర రాజకీయ రంగానికి తీవ్రమైన లోటు. వారి మరణానికి సానుభూతి తెలియజేస్తూ, వారికి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు (మంథని): ఈ రోజు పెద్దలు ద్రోణంరాజు సత్యనారాయణగారి మృతిపట్ల , గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. స్వర్గీయులైన ద్రోణంరాజు సత్యనారాయణగారు గొప్ప రాజకీయవేత్త. ఈనాడు ప్రసంగించిన పెద్దలందరూ వారి గురించి అన్నీ చెప్పారు. వారికి మా కుటుంబానికి ఉన్న సాన్నిహిత్యం, మా తండ్రిగారితో వారికున్న సాన్నిహిత్యం వలన అనేక సార్లు రాజకీయాలలో వారిని చాలా దగ్గరగా చూడడం జరిగింది. అప్పటి నుండి ఉత్తరాంధ్రలో ప్రముఖ రాజకీయవేత్తగా రాష్ట్ర రాజకీయాలలో ఒక వెలుగు వెలిగి పార్లమెంట్, ఇటు అసెంబ్లీలో వారు ప్రత్యేక పాత్రను పోషించడం పెద్దలందరూ ప్రస్తావించడం జరిగింది.

ఈ రోజు ఎంతో మంది రాజకీయవేత్తలను ఒక పొలిటికల్ ట్రస్టీలాగా అంటే చాలా మంది రాజకీయవేత్తలను వారు తయారుచేయడం జరిగింది. అందులోనూ ఉత్తరాంధ్రలో ఉన్న గౌరవ శాసనసభ్యులు ఉన్నారు. ఇది వారికి ఒక రిఫ్లెక్షన్. ఈ రోజు వారు విశాఖపట్టణం, ఉత్తరాంధ్రలో అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆంధ్ర ట్రేడ్ యూనియన్ లీడర్‌గా గొప్ప సంఘ కార్యకర్తగా, గ్రామీణ వ్యవస్థను మెరుగుపరచేందుకు అనేక కార్యక్రమాలను తీసుకురావడంలో ముందుగా ఉన్నారు. అటువంటి వారు ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. పెద్దలు ద్రోణంరాజు సత్యనారాయణగారి మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియచేస్తూ, వారి ఆత్మకి శాంతి చేకూరాలని కోరుతూ, సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER: "This House places on record its deep sense of sorrow at the demise of Sri Dronamraju Satyanarayana, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

Sri Dronamraju Satyanarayana was born on 19th Deember, 1933, in China Musiliwada village of Visakhapatnam District. He was elected to Lok Sabha from Visakhapatnam Constituency in 1977. He

was elected to State Legislative Assembly from Pendurthi Constituency in 1977. He was elected to State Legislative Assembly from Pendurthy Constituency in the bye elections held in 1980. He served as a Member of Rajya Sabha for two terms from 1988. He was once again elected to State Legislative Assembly from Visakha-I Constituency in the General Elections held in 2004. He strove well for the development of his Constituency.

As a Trade Union Leader he rendered invaluable services to the working class of Visakhapatnam. He served as a President to Hindusthan Polymers Limited Workers Union, Visakha Port and Dock Workers Union, Dock Labour Board Employees Union. Besides being a popular politician, Sri Dronamraju Satyanarayana was a good theatre artist, writer and also known for his wit and humour, he was a great source of inspiration for me in this House.

Sri Dronamraju Satyanarayana died on 28th December, 2005. He was 73 years old.

Let us observe silence for two minutes as a mark of respect to the departed soul.

(Then the silence was observed for two minutes.)

MR. SPEAKER: Now the House is adjourned to meet again at 08.30 AM tomorrow .

(The House then adjourned at 10.08 AM to meet again at 08.30 AM on Thursday, the 16th February, 2006)